## క్లుప్తంగా

### అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**మణుగూరురూరల్:** మండలంలోని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డి.భద్రయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఒక ఇంగ్లీష్, ఒక ఎకనామిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని అతిథి అధ్యాపకులతో నియమించేందుకు అర్హత గలవారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని తెలిపారు. పీజీలో 55శాతం మార్కులు, పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 11వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 12వ తేదీన ఉదయం 10 గంటలకు అర్హత గల అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని, అభ్యర్థుల తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో సకాలంలో హాజరుకావాలని తెలిపారు.

### ఇళ్లు మంజూరు చేయాలి

**మణుగూరురూరల్:** వరద ముంపుకు గురై నిరాశ్రయులైన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు విఠల్‌రావునగర్ వాసులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ అనుబంధ గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్‌డి.నాసర్ పాషా మాట్లాడుతూ.. వర్షాలు, వరదలతో నిరాశ్రయులైన బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా మున్సిపాలిటీ పరిధిలో నివారణ చర్యలు చేపట్టాలని ఆయన ఎమ్మెల్యే పాయంను కోరారు. ఇఫ్టూ నాయకులు మంగీలాల్, శివరామకృష్ణ, శేఖర్, వరద ముంపు బాధితులు జి.విజయలక్ష్మి, సీహెచ్.పద్మ, మల్లీశ్వరి, రాము, లక్ష్మి, అలివేలు, కృష్ణవేణి పాల్గొన్నారు.

### వేతనాలు చెల్లించాలి

**బూర్గంపాడు:** మధ్యాహ్న భోజన వర్కర్ల వేతనాలను తక్షణమే చెల్లించాలని సోమవారం మధ్యాహ్న భోజన వర్కర్లు మండల విద్యావనరుల కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. 22ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న తమకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని వర్కర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన వర్కర్ల వేతనాలు పెంచాలని, పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ ఇన్‌చార్జ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు ఆకుల పద్మావతి, కార్యదర్శి ధరావత్ బుజ్జి, ఉపాధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### పరిమితికి మించి వైద్యం చేయొద్దు

**దుమ్ముగూడెం:** నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఆర్‌ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయవద్దని డాక్టర్ సుభాష్ సూచించారు. సోమవారం ఆర్‌ఎంపీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆర్‌ఎంపి లు పరిమితికి మించి వైద్యం చేయవద్దని ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని ఆదేశించారు. ఆర్‌ఎంపీలు అధిక మోతాదులో యాంటీ బయాటిక్స్, స్టిరాయిడ్ ఇంజక్షన్, ఐవీ ఫ్లూయిడ్స్ వంటివి అధికంగా వినియోగించరాదని సూచించారు. ఎవరైనా అర్హతకు మించి వైద్యం చేసినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ టి.బాబ ఎరావు, ఆర్‌ఎంపీలు పాల్గొన్నారు.

### గ్రామాల్లో వైద్య శిబిరాలు

**మణుగూరురూరల్:** మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వరద ముంపుకు గురైన అశోక్‌నగర్, సాయినగర్, గుండుసింగారం, వెంకటపతినగర్, ఎస్టీకాలనీ, వైఎస్‌ఆర్ నగర్, చంద్రబాబునగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం వైద్యశిబిరాలు నిర్వహించారు. వైద్యాధికారి శివకుమార్, వైద్యసిబ్బంది వైద్య పరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### ఘాట్ వద్ద మరమ్మతులు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని గోదావరి కరకట్ట వద్ద ఉన్న వినాయకుడిని నిమజ్జన ఘాట్ వద్ద గడిచిని మూడు రోజులుగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం నిమజ్జన ఘాట్ వద్ద మట్టితో పాటు పీజీ ని పోసి ర్యాంపును పటిష్టంగా తయారుచేస్తున్నారు. కాగా భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, భద్రాచలం గ్రామ పంచాయతీ ఈవో శ్రీనివాసరావులు ర్యాంప్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

### వినాయక నిమజ్జనం

**గుండాల:** మూడు రోజులపాటు పూజల అందుకున్న బొజ్జ గణపయ్యను సోమవారం ఘనంగా నిమజ్జనం చేశారు. గురుకుల కళాశాలలో ప్రతిష్ఠించిన గణపయ్యకు మూడు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం సోమవారం కళాశాల సిబ్బంది అధ్యాపకుల ఆధ్వర్యంలో ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పులతో నృత్యాలు చేస్తూ మల్లన్న వాగులో నిమజ్జనం చేశారు.ప్రిన్సిపల్ పురుషోత్తం, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, సిబ్బంది పోతయ్య పాల్గొన్నారు.

# ఏజెన్సీ వైద్యంపై నిర్లక్ష్యం

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- మందుల లభ్యత అంతంత మాత్రమే..
- ప్రైవేటును ఆశ్రయిస్తున్న గిరిజనులు

**దుమ్ముగూడెం:** ఏజెన్సీలోని ప్రజలకు మెరుగైన వైద్యం ఇంకా అందని ద్రాక్ష గానే మిగులుతుంది. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామని, పేదల ప్రాణాలను కాపాడేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని పాలకులు చెబుతూనే ఉన్నారు. కానీ క్షేత్రస్థాయిలో వారి మాటలకు విరుద్ధంగా కనిపిస్తోంది. ఏజెన్సీలో సరిపడా సిబ్బందిని నియమించక పోవడంతో వైద్యశాలకు వచ్చే రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదు.

మండలంలో 24గంటలు పని చేసే దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉంది. కానీ, గత కొన్ని నెలలుగా ఒక్కడే వైద్యుడు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నాడు. దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో నిత్యం 100 మందికి పైగా అవుట్ పేషెంట్‌లు వస్తుంటారు. దాంతో పాటు గర్భిణులకు డెలివరీలు చేయాల్సి ఉంటుంది. సిబ్బంది లేక ఉన్న సిబ్బంది ఒత్తిడితో పనులను నిర్వహిస్తున్నారు. దుమ్ముగూడెం మండలంలో 37 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 100కు పైగా గ్రామాల ప్రజలు దుమ్ముగూడెం, పర్ణశాల, నర్సాపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు రోగాల భారీన పడితే వస్తుంటారు. దీంతో పాటు సరిహద్దున ఉన్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఆదివాసీలు వైద్య సేవలకు మండలంలోని పర్ణశాల, దుమ్ముగూడెం పీహెచ్‌సీలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో వైద్యశాలలో సరిపడా సిబ్బంది లేక పోవడంతో వైద్యశాలకు వచ్చే రోగులను భద్రాచలం రిఫర్ చేస్తుంటారు. ఏజెన్సీలో ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల ఘటనలు చోటు చేసుకుంటూ ఉంటాయి. ఈ క్రమంలో సత్వర వైద్య సేవల కోసం వైద్యశాలకు వస్తే సిబ్బంది అందుబాటులో ఉండక పోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం..

**ఖాళీగా ఉన్న పోస్టులు..**

దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్సులు-3, ల్యాబ్ టెక్నీషియన్-1, ఫార్మాసిస్ట్-1, ఏఎన్‌ఎంలు-3, సూపర్ వైజర్-1 పర్ణశాలలో స్టాఫ్‌నర్స్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నర్సాపురం ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్-1, సూపర్ వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలే ఈ కాలంలో వైద్య సిబ్బంది కొరత ఉండటం వల్ల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదు. దుమ్ముగూడెం, నర్సాపురం వైద్యశాలలో రోగా నిర్ధారణ చేసే ల్యాబ్ టెక్నీషియన్స్ నియామకం చేపట్ట లేదు. రోగాల భారీన పడిన ప్రజలు రోగా నిర్ధారణ చేసుకోవడానికి ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించి జేబులను గుల్ల చేసుకుంటున్నారు. నర్సాపురం వైద్యశాలలో గత రెండు నెలలుగా సీబీసీ టెస్ట్ మిషన్ మరమ్మతులకు గురైన పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దుమ్ముగూడెం వైద్యశాలలో ఒక్కడే వైద్యుడు ఉండటంతో ఆయన వ్యక్తిగత పనులపై బయకు వెళ్లినప్పుడు గాని, వైద్య శిబిరాలు నిర్వహించడానికి గ్రామాల్లోకి వెళ్లినప్పుడు గాని వైద్యశాలకు వచ్చే రోగులకు సేవలు అందనట్లే..

**మందుల కొరత..**

మండలంలోని మూడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో సరిపడా మందులు లేక పోవడంతో వైద్యశాలలకు వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రజలు ప్రైవేట్ దుకాణాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా అధికారులు వైద్యశాలలపై దృష్టిపెట్టి సిబ్బంది కొరత, మందుల కొరత తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

**సిబ్బందిని నియమించాలి**



మండలంలో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టుల్లో తక్షణమే అధికారులు సిబ్బందిని నియమించి వైద్యశాలలో నెలకొన్న సిబ్బంది కొరతను వెంటనే తీర్చాలి. అలాగే కొంచెం ఖర్చు పెడితే రిపేర్ అయ్యే పరికరాలను వృథాగా వదిలేస్తున్నారు. వాటిపై దృష్టి పెట్టి మరమ్మతులు చేయించాలి

– దామెర్ల శ్రీనివాస్‌రావు, బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ నాయకుడు

# కాళోజీకి ఘన నివాళి

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో కాళోజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. తెలుగు భాష, సాహిత్యానికి కాళోజీ చేసిన కృషి, సేవలు మరువలేనివని గుర్తు చేసుకున్నారు. ఆయన జీవితం, కవితా విలువల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమాల్లో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: జెడ్పీ ఉన్నత పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


అన్నపురెడ్డిపల్లి: కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్


కరకగూడెం: కాళోజీ చిత్రపటం వద్ద తహసీల్దార్ నాగ ప్రసాద్, ఉద్యోగులు


పినపాక: నివాళులర్పిస్తున్న డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది


అశ్వారావుపేట: నివాళులర్పిస్తున్న అశ్వారావుపేట మైనారిటీ స్కూల్ సిబ్బంది


బూర్గంపాడు: మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, తదితరులు


దుమ్ముగూడెం: పర్ణశాల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయుల నివాళి..

# కోడిపుంజుల వాగు వరద పరిశీలన


కోడిపుంజుల వాగు వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరుటౌన్:** మండలంలోని సమితిసింగారం గ్రామ పంచాయతీలోని కోడిపుంజుల వాగు వరద ఉధృతిని సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు. పంచాయతీ అకాల వర్షాలను దృష్టిలో పెట్టుకుని వరద ఉధృతి కాల్వకు అడ్డుగా కొట్టుకువచ్చిన చెత్తా చెదారాన్ని తొలిగించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా నష్టపోయిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులగూడెం గ్రామానికి చెందిన కలబోయిన నర్సింహారావు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కాటబోయిన నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు నవీన్, నాయకులు పాల్గొన్నారు.

# 11న కలెక్టరేట్ ఎదుట ధర్నా

**భద్రాచలంటౌన్:** ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని కోరుతూ.. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ నెల 11న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పోరాట సమితి జిల్లా అధ్యక్షులు దాసరి శేఖర్ కోరారు. స్థానిక అశోక్ నగర్ కాలనీలో సోమవారం జరిగిన మాల మహానాడు పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఉన్న మాల విద్యార్థులు, మాల కార్యకర్తలు, అంబేడ్కర్ అభిమానులు, మాల మహిళలు, ఉద్యోగస్తులు ఏబిసిడి వర్గీకరణను రద్దు చేసేంత వరకు ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చెనగ అర్జున్, దాసరి నరేష్, మోతుకూరి ప్రసాద్, శివ, శనిగిరి చిట్టిబాబు, దేవరాజు, కాపుల సూరి, మద్దేటి జయ, కొండ్రు రమాదేవి, జయ, లక్ష్మి కుమారి తదితరులు పాల్గొన్నారు.

**29న ఆత్మీయ సమ్మేళనం**

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లాలోని 5 నియోజకవర్గాల్లోని మాలలతో ఈనెల 29న జిల్లా కేంద్రంలో మాలల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పోరాట సమితి జిల్లా నాయకులు అల్లాడి పాలరాజు కోరారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మద్దతు ఇచ్చేటువంటి అన్ని వర్గాలను కలుపుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మద్దెల శివకుమార్, రవీందర్, శ్రీకాంత్, శ్రీనివాస్, సారిక నరసింహ, పుష్పలత, కల్పన, మోహన్, బి.నరేష్, రామారావు, తిరుపతి బుడిబుడి, ప్రభాకర్, రామారావు, ప్రతాప్, కొండల్, రవి, వంశీ, పద్మారావు, శివ, వెంకటేష్, ఈశ్వరయ్య, రాజేశ్వరరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీడీఓగా ప్రవీణ్ కుమార్



**అశ్వారావుపేట:** అశ్వారావుపేట నూతన ఎంపీడీఓగా పి.ప్రవీణ్ కుమార్ సోమవారం విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన శ్రీనివాసరావు పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఇల్లందు ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ పదోన్నతిపై అశ్వారావుపేట ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. కాగా ఈనెల 6 సాయంత్రం అశ్వారావుపేట ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిప్పటికీ.. శని, ఆదివారాలు శెలవుదినాలు కావడంతో సోమవారం అందుబాటులో ఉన్నారు.

### పీఆర్‌టీయూతోనే సమస్యల పరిష్కారం

**అన్నపురెడ్డిపల్లి:** పీఆర్‌టీయుతోనే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం అవుతాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు అన్నారు.సోమవారం మండలంలోని పలు పాఠశాలలో ఆ సంఘం నిర్వహించిన సభ్యత్వాలను పరిశీలించి, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు. ప్రభుత్వం రెండు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండలాధ్యక్షుడు జయకర్, రమేష్, శంకర్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

**మణుగూరుటౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమికొన్న పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉపేంద్ర ఆధ్వర్యంలో సోమవారం కాళోజీనారాయణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.

తెలంగాణ బాషా దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు మాలోత్ భద్రుని విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం వకృత్వ, వ్యాసరచన, పద్యపఠన, చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంమంలో ఉపాధ్యాయులు కనకదుర్గ, సావిత్రి, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

### నిమజ్జన ఘాట్ వద్ద మరమ్మతులు

**భద్రాచలంఅర్బన్:** భద్రాచలం పట్టణంలోని గోదావరి కరకట్ట వద్ద ఉన్న వినాయకుడిని నిమజ్జన ఘాట్ వద్ద గడిచిని మూడు రోజులుగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం నిమజ్జన ఘాట్ వద్ద మట్టితో పాటు పీజీని పోసి ర్యాంపును పటిష్టంగా తయారుచేస్తున్నారు. కాగా భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, భద్రాచలం గ్రామ పంచాయతీ ఈఓ శ్రీనివాసరావు దగ్గరుండి ర్యాంప్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

### దెబ్బతిన్న పంటల పరిశీలన


దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ తాతారావు

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని తిర్లాపురం గ్రామంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పంటలను మణుగూరు వ్యవసాయశాఖ సంచాలకుడు (ఏడీఏ) బి.తాతారావు సోమవారం పరిశీలించారు. నష్టపోయిన పంటల వివరాలను సంబంధిత రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏడీఏ మాట్లాడుతూ.. వర్షాలకు దెబ్బతిన్న పంటలను పూర్తి స్థాయిలో ప్రాథమిక అంచనా వేసి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు కొమరం లక్ష్మణ్‌రావు, చటర్జీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### దొంతికుంట ఆక్రమణలపై ఫిర్యాదు

**అశ్వారావుపేట:** అశ్వారావుపేటలోని దొంతికుంట చెరువు, పంటకాలువలు ఆక్రమణలపై తహశీల్దార్ కృష్ణప్రసాద్‌కు ఆయకట్టు రైతులు సోమవారం ఫిర్యాదు చేశారు. దొంతికుంట చెరువు పంట కాలువలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని వ్యవసాయ భూముల్లో భవనాలు నిర్మించడం వల్ల ఆయకట్టు పొలాలు కొన్ని మునకకు గురికాగా.. మరికొన్ని పొలాలకు సాగునీరు అందటం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సమీప నివాస గృహాలు కూడా ముంపుకు గురవుతున్నాయని పేర్కొన్నారు. అశ్వారావుపేటకు చెందిన శీమకుర్తి కృష్ణ అనే వ్యక్తి తనకు దొంతికుంట చెరువు ఆయకట్టులో ఉన్న వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి పురాతన పంటకాల్వను పూడ్చి సమీప పొలాలకన్నా 5అడుగుల ఎత్తు మట్టితో నింపి రియల్ ఎస్టేట్ వెంచర్‌ను ఏర్పాటు చేశారని. తద్వారా దిగువ వ్యవసాయ భూములకు సాగునీరందటం లేదని పేర్కొన్నారు. ఆక్రమణలను పరిశీలించి ఆయకట్టు రైతులకు సాగునీరందించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతులు చెన్నూరి రామకృష్ణ, సీహెచ్.సురేష్, బి.వెంకటనర్సమ్మ, పీ చంద్రశేఖర్ ఉన్నారు.

# పాఠశాలలో అధికారుల తనిఖీ


లక్ష్మీనగరం పాఠశాలను సందర్శించిన తహసీల్దార్, ఎంఈఓ

**దుమ్ముగూడెం:** లక్ష్మీనగరం గ్రామంలోని ప్రైమరీ పాఠశాలను తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంఈఓ సున్నం సమ్మయ్యలు సోమవారం సందర్శించారు. పాఠశాల అవరణ అంతా పరిశీలించారు. పాఠశాల ఆవరణను గ్రావెల్‌తో నింపితే విద్యార్థులకు అనువుగా ఉంటుందని గ్రామస్తులు వారి దృష్టికి తీసుకురాగా.. కావాల్సిన గ్రావెల్‌ను ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి వైద్యం పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. లక్ష్మీనగరం మాజీ ఉపసర్పంచ్ గుడ్ల రామ్మోహన్ రెడ్డి, అక్బర్, వేమన, వీరేందర్ రెడ్డి, బత్తుల శోభన్‌బాబులు పాల్గొన్నారు.

# నిరంతర సాధనతో విజయం

**మణుగూరుటౌన్:** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక ధృడత్వాన్ని కలిగించడంతో పాటు నిరంతర సాధన విజయానికి నాంది పలుకుతాయని ఏరియా జీఎం, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ అధ్యక్షుడు దుర్గం రాంచందర్ అన్నారు. సోమవారం మణుగూరు ఏరియా డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి పీవీకాలనీలోని భద్రాద్రి స్టేడియంలో ఏరియా లెవల్ క్రీడా పోటీలు ప్రారంభానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులు క్రీడామెళకువలు ఆకలింపు చేసుకుని సమయస్ఫూర్తితో ఆడితే తప్పక విజయం వరిస్తుందన్నారు. అనంతరం షటిల్ ఆడి క్రీడలన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ కో-ఆర్డినేటర్ డీజీఎం (పర్సనల్) సలగల రమేశ్, అధికారులు అవినాష్, ఏఐటీయూసీ నాయకులు మేకల ఈశ్వర్, ఐఎన్‌టీయూసీ నాయకులు రామారావు, సీఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ సాయిల సురేశ్, ఉద్యోగ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జీఎం దుర్గం రాంచందర్

# నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

**మణుగూరురూరల్:** మండల పరిధిలోని రామానుజవరం గ్రామ పంచాయతీ కొండాయిగూడెం ఘాట్ నందు గణేష్ నిమజ్జన ఏర్పాట్లను మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోదావరిలో గణపతి నిమజ్జనాల నిమిత్తం అన్ని ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. వర్షాల నేపథ్యంలో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోందని, గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు వచ్చే భక్తులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిమజ్జనం కోసం లోతు ప్రాంతానికి వెళ్లొద్దని సూచించారు. రాత్రి సమయంలో నిమజ్జనానికి వచ్చే భక్తులు అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ సతీష్‌కుమార్, ఎంపిఓ పి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

**చండ్రుగొండ:** నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే అగ్రగామిగా నిలుపుతానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలోల సోమవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఇటవల కాలంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నీటినిల్వలతో ఇబ్బందులు పడుతున్న వారి బాధలను చూశారు. రావికంపాడు, బాల్యాతండా, వెంకటియాతండా, కరిశెలబోడు, వంకనంబరు గ్రామాల్లో ఆయన పర్యటన సాగింది. ప్రధానంగా డ్రెయినేజీలు లేక జనం పడుతున్న ఇబ్బందులపై ఆయన స్పందించారు. డ్రెయినేజీల నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈమేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. వివిధ గ్రామాల్లో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈపర్యటనలో ఆయన వెంట భోజ్యా నాయక్, సారేపల్లి శేఖర్, గుగులోత్ బాబు, కోటేశ్వరరావు, దారం గోవిందరెడ్డి, ఇమ్రాన్, ఫజల్‌భక్ష్ తదితరులు పాల్గొన్నారు.